సాక్షి
వరంగల్
ఆదివారం । 8 । జనవరి । 2023



లైంగికదాడులకు వ్యతిరేకంగా పోరాడాలి

సమాజంలో మహిళలపై జరుగుతున్న లైంగికదాడులకు వ్యతిరేకంగా మహిళలంతా కలిసి పోరాడాలని పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య పిలుపునిచ్చారు. - 10లో▸



కళాఉత్సవ్ విజేత లక్ష్మీప్రియ

కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కళాఉత్సవ్ పోటీల్లో హనుమకొండ జిల్లాకు చెందిన లక్ష్మీప్రియ ప్రథమ స్థానం సాధించింది. - 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.3^0/17.5^0

జిల్లాలో పొగమంచుతో కూడిన వాతావరణం ఉంటుంది. ఉదయం, రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి



ఖానాపురం: రైతుల శ్రేయస్సు కోసమే సహకార సంఘాలు ఉపయోగపడుతున్నాయని జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలతో పాటు ఫర్టిలైజర్ గోదాంను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో రైతులకు కావాల్సిన ఎరువులను సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ఆంజనేయులు, సిబ్బంది రాజు, వినయ్, అశోక్, భీమయ్య, కొంరయ్య పాల్గొన్నారు.

విద్యాదానంలో భాగస్వాములు కావాలి

నల్లబెల్లి: విద్యా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు భాగస్వాములు కావాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గందె శ్రీనివాస్ గుప్త అన్నారు. శనివారం జరిగిన సంఘ జిల్లా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్య కుటుంబాలకు చెందిన విద్యార్థులకు సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు స్థానిక ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఖానాపురం: మండలంలోని అశోక్‌నగర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మంజుల తెలిపారు. శనివారం పాఠశాలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని శ్రీనిత్య, గైడ్ టీచర్ వంగ రాజును అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 9, 10, 11 తేదీల్లో నిర్మల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ యువజన పురస్కారానికి శ్రీకాంత్



వర్ధన్నపేట: వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన జక్కి శ్రీకాంత్ జాతీయ యువజన పురస్కారానికి ఎంపికైనట్లు భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో హుబ్లీ దార్వాడ్ నగరాల్లో జరిగే 26వ జాతీయ యువజన వారోత్సవాల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పది సంవత్సరాలుగా సామాజిక సేవ చేస్తున్న తనకు భారత ప్రభుత్వం గుర్తించి జాతీయ యువజన పురస్కారాన్ని అందించడం గర్వకారణమన్నారు. దీంతో తనకు మరింత సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ఈ పురస్కారం రావడానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

వర్ధన్నపేట: రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ, తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరమ్ సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభ పాటవ పోటీలు పూర్తయ్యాయని జిల్లా సోషల్ ఫోరమ్ అధ్యక్షుడు తాటిపాముల రమేష్, ప్రధాన కార్యదర్శి పోలేపెల్లి రవి శనివారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 250 మంది విద్యార్థులు పోటీ పడ్డారన్నారు. గెలుపొందిన విద్యార్థులకు వరంగల్ జూబ్లీ హైస్కూల్‌లో బహుమతులు అందించినట్లు వారు తెలిపారు.

హుండీ లెక్కింపు

పర్వతగిరి: మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో యాకుబ్‌బాబా దర్గా హుండీలను శనివారం వక్ఫ్‌బోర్డు అధికారుల సమక్షంలో లెక్కించారు. 2022 సెప్టెంబర్ నుంచి జనవరి 7వ తేదీ వరకు దర్గా హుండీల ఆదాయం రూ.7,80,250 వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ మహ్మద్ అసదుల్లాఖాన్, అసిస్టెంట్ సెక్రటరీ కాజీ సయ్యద్‌నూరుల్లా, రియాజ్‌పాషా, గయాసుద్దీన్, ఎంఏ అయాన్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3.50కోట్లతో రైల్వే ఐఓహెచ్ షెడ్

మళ్లీ మొదటికి..
16 మంది కార్మికుల నియామకాలను నిలిపేసిన ఎంజీఎం అధికారులు

ప్రజలను చైతన్యం చేస్తూ ఉద్యమాలు - 12లో▸





మగ్గంపై రామప్ప చీర నేస్తున్న కార్మికురాలు

చేనేతపై రామప్ప శిల్పాల సౌందర్యం రూపుదిద్దుకుంటోంది. సిల్క్ చీర జరీ అంచుల్లో శిల్పకళ.. ధగధగా మెరిసిపోతోంది. చూడగానే ఆకట్టుకుంటున్న ఈ చీరలు అతివల మనసులు దోస్తున్నాయి. నేత కార్మికుల నైపుణ్యం.. వారి ఏకాగ్రతకు అద్దం పడుతోంది. కమలాపూర్ చేనేత సహకార సంఘంలో జకాట్‌పై తయారవుతున్న రామప్ప చీరలు.. వాటి ప్రత్యేకతపై ఈ వారం సండే స్పెషల్ స్టోరీ!

- వర్దెల్లి లింగయ్య, సాక్షి వరంగల్ డెస్క్
ఫొటోలు : పి.వరప్రసాద్, సాక్షి ఫొటోగ్రాఫర్, వరంగల్

రామప్ప చీరలు



రామప్ప చీరల ప్రత్యేకత..

Sunday Special

చేనేతపై రామప్ప సొబగులు

సిల్క్ చీరలపై శిల్పాకృతులు

- పది మంది కార్మికులకు ప్రత్యేక శిక్షణ
- 'ఉత్పత్తి మార్పు' పథకం కింద టెస్కో నుంచి ఆర్డర్
- ప్రత్యేకంగా రెండు మగ్గాల అందజేత
- ఇప్పటివరకు నాలుగు రకాల చిత్రాలు

వరంగల్, తెలంగాణ రాష్ట్ర టెస్కో వాళ్లు చేనేతలో వివిధ రకాల వస్త్రాలు తయారు చేస్తుంటారు. చేనేత సహకార సంఘాల ద్వారా లుంగీలు, బెడ్ షీట్లు, టవళ్లు, చెద్దర్లు నేయిస్తుంటారు. ప్రస్తుతం వీటికి పెద్దగా గిరాకీ లేదు. నేసినవన్నీ కుప్పలుగా పేరుకుపోతున్నాయి. ఈనేపథ్యంలో 'ఉత్పత్తి మార్పు' పథకం కింద మార్కెట్‌లో దేనికి డిమాండ్ ఉందో.. ఏది ఎక్కువగా ఇష్టపడుతున్నారో వాటిని తయారు చేసి, మార్కెటింగ్ చేయాలి. యునెస్కో గుర్తింపు పొంది ప్రపంచ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న రామప్ప ఆలయ శిల్పాలను చీరలపై.. అదీ చేతి మగ్గంపై వేస్తే అతివలను ఆకట్టుకోవచ్చని భావించారు. కమలాపూర్ చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం కార్మికులు మగ్గంపై ఇమ్రు చీరలు, జీన్స్‌క్లాత్ తయారు చేసిన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని రామప్ప చీరల తయారీ బాధ్యత అప్పగించారు. పదిమంది మహిళలకు 45 రోజులు శిక్షణ ఇచ్చారు.





త్వరలో మరిన్ని డిజైన్లు.. పట్టుచీరలు

మగ్గంపై సిల్క్ చీరలు, పట్టు చీరలు తయారు చేయాలనుకుంటున్నారు. కొనుగోలుదారులు ఏ వెరైటీ కోరుకుంటారో వాటిని కూడా ప్రవేశపెట్టాలనేది టెస్కో ఆలోచన. సంఘాలు కూడా దాని ప్రకారం ముందుకు సాగుతున్నాయి. ఇందుకోసం మగ్గాలు సమకూరుస్తున్నాయి. కొద్దిరోజుల్లో మరో నాలుగు మోడరన్ మగ్గాలు రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామప్పలో ఏనుగులు, రాగిని, నాగిని శిల్పం, పొన్న చెట్టు, మదనికలు, అష్ట దిక్పాలకులు.. అప్పటి మల్ల యుద్ధం, రంగ మండపం.. ఇలా 30 రకాల శిల్పాలు ఉన్నాయి. వీటి ఆకృతులతో తయారు చేయాలంటే ఎలక్ట్రానిక్ జకాట్స్ అవసరం. ఇవి వస్తే అన్ని రకాల డిజైన్లను తయారు చేసే అవకాశం ఉందని కార్మికులు చెబుతున్నారు. ఇప్పుడు నేస్తున్నవి సిల్క్‌వి.. పట్టుతో నేయాలంటే మరో రూ.3వేల దాకా అదనంగా ఖర్చు వస్తుంది.

రామప్ప చీరలు నేయాలంటే ఇక్కడున్న సాధారణ మగ్గాలు పనికి రావు. దీంతో టెస్కో నుంచి మోడరన్ మగ్గాలు రెండు, జకాట్స్, లిఫ్టింగ్ ఇచ్చారు. వీవర్స్ సర్వీస్ సెంటర్ నుంచి వీటి నిర్వహణ ఉంటుంది. చీరల తయారీకి సిల్క్ యార్న్ అవసరం. ప్రత్యేకంగా పడుగులు (నిలువు) పోయించాలి. చీరలకు పేరుగాంచిన ధర్మవరం నుంచి పడుగులు పోయించారు. జకాట్స్ (మగ్గంలో డిజైన్ తయారు చేసే ప్రత్యేక విభాగం), లిఫ్టింగ్ మిషన్లు తమిళనాడు నుంచి వచ్చాయి. మోడరన్ మగ్గం అయినా జకాట్స్‌ను చేత్తోనే ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. అట్టలు (డిజైన్లవి) నాలుగు రకాలు వచ్చాయి.. వీటిని తయారు చేసే టెక్నాలజీ ఇక్కడ లేకపోవడంతో ధర్మవరం నుంచి తీసుకువచ్చారు. ఇవి వీవర్స్ సర్వీస్ సెంటర్ డైరెక్షన్‌లో తయారవుతాయి. చీర బార్డర్‌లో రామప్ప శిల్పాల్లోని ఏనుగులు, అష్ట దిక్పాలకులు, గుడి గోపురం, శివలింగం ఇలా నాలుగు శిల్పాకృతులను నేస్తున్నారు. మధ్యలో బూటా వచ్చి సిల్క్ జరీ వాడుతున్నారు. సంఘానికి ఉత్పత్తి మార్పు పథకం కింద టెస్కో నుంచే యార్న్ (దారం) ఇచ్చారు. ఉత్పత్తి చేసి వారికి ఇచ్చేస్తారు. సొసైటీలు, టెస్కో మార్కెటింగ్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 24 చీరలు తయారు చేసి ఇచ్చారు.

ఒక చీరకు పది రోజులు..

రామప్ప చీర తయారీకి ఇప్పుడున్న మగ్గంపై నేయాలంటే పది రోజుల సమయం పడుతుంది. సన్న పని అయినా దీనికి ఓపిక.. ఎక్కువసేపు మగ్గంపై కూర్చోవాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి 12/12 చీరలు నేశారు. కొత్త కావడం.. చేతితో ఆపరేట్ చేసే జకాట్ కావడంతో ఇంత సమయం పడుతుందని, అనుభవం వచ్చాక నాలుగు రోజులకు ఒక చీర నేయవచ్చని చెబుతున్నారు.

చీర తయారీకి ఖర్చు ఇలా..

రామప్ప చీర నేయాలంటే యార్న్‌కు రూ.7వేలు, కార్మికుడి కూలి రూ.4,500 అవుతుంది. మరో రూ.500 ఇతరత్రా ఖర్చులు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.13వేలకుపైనే అమ్ముతున్నారు. ప్రస్తుతం సిల్క్ బై సిల్క్, సిల్క్ ఆర్ట్ సిల్క్ తయారు చేశారు. యార్న్ ధర ఎక్కువ పెడితే ఖర్చు కూడా ఎక్కువ వస్తుందని, చీర మరింత అందంగా వస్తుందని కార్మికులు చెబుతున్నారు.

మరో 60 చీరలు అడిగాం..



చీరలు బాగున్నాయని చాలామంది ఫోన్లు చేస్తున్నారు. టెస్కో ఇచ్చిన ఆర్డర్‌ను పూర్తి చేసి వారికే ఇచ్చాం. మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో ఆరు మాసాల ఉత్పత్తి కోసం మరో 60 చీరలు అడిగాం.. అది ప్రాసెస్‌లో ఉంది. నాలుగు ఎలక్ట్రానిక్ జకాట్స్ కూడా వస్తున్నాయి. ఇప్పుడు నేస్తున్న చీరలు సిల్క్‌వి అయినా.. పట్టులాగా ఉంటాయి. అందుకే మహిళలు ఇష్టపడుతున్నారు. ఆరు నెలల ఆర్డర్ వస్తే మేం అమ్మడంతోపాటు టెస్కో వాళ్లకు కూడా ఇస్తాం. ఎలక్ట్రానిక్ జకాట్స్ వస్తే తీరొక్క డిజైన్ వేసుకోవచ్చు. కార్మికులకు కూడా మెరుగైన ఉపాధి లభిస్తుంది.

- సామల దామోదర్, మేనేజర్, కమలాపూర్ చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి సంఘం

8 చీరలు నేసిన..



రామప్ప చీరల తయారీలో శిక్షణ ఇచ్చారు. వీటిని తొందరగా అర్థం చేసుకోవాలి. డిజైన్లు సెట్ చేయాలంటే ఓపిక అవసరం. మొదట నాకు ఒక చీరకు 15 రోజులు పట్టింది. ఆ తర్వాత అర్థమైంది. పది రోజుల్లోనే నేసిన. ఒక్కో చీరకు రూ.4వేలు కూలి ఇచ్చారు. ఇలాంటి ఆర్డర్లు వస్తే కార్మికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. నేను మొత్తం 8 చీరలు నేసిన.

- సబ్బని సునీత, చేనేత కార్మికురాలు

ఇప్పుడు రెండే మగ్గాలు వచ్చాయి..



నేను కూడా రామప్ప చీరల తయారీలో శిక్షణ తీసుకున్నా. ప్రస్తుతం మోడరన్ మగ్గాలు రెండే వచ్చాయి. ఇమ్రు వస్త్రాలు నేస్తున్నా. మరికొన్ని మగ్గాలు వచ్చాక నేను కూడా రామప్ప చీరలు నేస్తాను. చేతితో ఆపరేట్ చేసే జకాట్ కావడంతో ఆలస్యమైంది. ఎలక్ట్రానిక్ జకాట్ అయితే పని తొందరగా అవుతుంది.

- గాజుల సవిత, చేనేత కార్మికురాలు

డ్రైవర్లు, వర్కర్ల వేతనాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

నర్సంపేట: వివిధ రంగాల్లో పని చేస్తున్న రైస్‌మిల్ డ్రైవర్లు, వర్కర్ల వేతనాలు పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచి ఇవ్వాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో మిల్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు తాళ్ల చంద్రశేఖర్ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేషం మాట్లాడుతూ రైస్‌మిల్ ఇండస్ట్రీలో పని చేస్తున్న కార్మికులకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ.5 వేల పింఛన్, ఇళ్లు లేని నిరుపేద డ్రైవర్లు, వర్కర్లకు హమాలీ, ఇతర కార్మికులకు ప్రభుత్వమే పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కార్మికులకు తాగునీరు, టాయిలెట్స్, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ డివిజన్ ఉపాధ్యక్షుడు మడిపల్లి కిరణ్, డివిజన్ కార్యదర్శి గిన్నారపు కుమారస్వామి, సహాయ కార్యదర్శి విలసాల రవి, కోశాధికారి దిడ్డి బుచ్చిరాములు, పెరుమాండ్ల భాస్కర్, డివిజన్ నాయకులు వెంకట్‌రెడ్డి, లడక యాకయ్య, మెంతుల భిక్షపతి, నల్ల శ్రీను, దూలం సాంబయ్య, చిన్నాల దూడయ్య, కాటిపాకల యాకయ్య, ఇనుముల సురేందర్, తక్కళ్లపల్లి కృష్ణ, ముసుకు మల్లయ్య, సముద్రాల స్వామి, కోశాల కోటి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి బూత్ కమిటీలే కీలకం



నర్సంపేట: మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి



వర్ధన్నపేట: మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

నర్సంపేట: బూత్ స్థాయిలో మెజార్టీ ఓట్లను బట్టే నియోజకవర్గ, రాష్ట్ర, దేశస్థాయిలో గెలుపునకు నాంది అని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ద్వారకపేటలోని ఎంఏఆర్ గార్డెన్‌లో శనివారం బీజేపీ నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమ్మేళనం రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. బూత్‌స్థాయి సమ్మేళనంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా వర్చువల్ విధానంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సరళయాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అవినీతి కుటుంబ పాలనను అంతం చేయాలన్నదే బీజేపీ లక్ష్యమన్నారు. బూత్ కమిటీ అధ్యక్షులు, సభ్యులు రాజకీయ అవగాహనతో ప్రజలతో సత్సంబంధాలను పెంచుకొని కష్టపడి పని చేస్తే వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. నర్సంపేట నియోజకవర్గ పాలక్, కరీంనగర్ మేయర్ పి.శంకర్, మహబూబాబాద్ పార్లమెంట్ కో కన్వీనర్ జాటోతు సంతోష్‌నాయక్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, కంభంపాటి ప్రతాప్, శ్రీనివాస్, జగన్, రజనిభారతి, గటిక అజయ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వర్ధన్నపేట: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాస్తవాలను వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఇల్లంద శివారు లక్ష్మి గార్డెన్స్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ పోలింగ్ బూత్ కమిటీ సమ్మేళనంలో కొండేటి శ్రీధర్ హాజరై మాట్లాడారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అరూరి రమేష్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తానని ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గురుమూర్తి శివకుమార్, జలగం అనితరంజిత్, రవి నాయక్, మల్లాడి తిరుపతిరెడ్డి, కేశవరెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి

- డీఎంహెచ్‌ఓ వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

వరంగల్: ఈ నెల 18నుంచి ప్రారంభించనున్న కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. శనివారం వరంగల్ పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్రీ భవన్‌లో జిల్లా వైద్యాధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ కంటివెలుగు కార్యక్రమాన్ని పీహెచ్‌సీల వారీగా, పట్టణాల్లో వార్డుల వారీగా చేపట్టేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. ఆశ కార్యకర్త నుంచి జిల్లా వైద్యాధికారి వరకు సమన్వయంతో పనిచేసి జిల్లాలోని 18 సంవత్సరాల పైబడిన వారికి కంటి అవసరాలకు అనుగుణంగా సేవలందించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాలరావు, జిల్లా కంటి వెలుగు ప్రోగ్రాం అధికారులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, కమ్యూనిటీ సెంటర్లలో స్థానిక ప్రజాప్రతినిధుల సహాయంతో శిబిరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు కంటివెలుగు కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించాలన్నారు. ప్రతి కంటివెలుగు శిబిరంలో వైద్యాధికారి, ఆప్తమిస్ట్, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లను సిద్ధం చేశామన్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యసేవలు అందించాలని, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లాలో 44 కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి వారం ఐదు రోజుల పాటు నిర్వహిస్తారని మొత్తం 100 రోజులు ఈ శిబిరాలు పనిచేస్తాయన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రకాశ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ చల్ల మధుసూదన్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, జిల్లా కంటి వెలుగు ఇన్‌చార్జ్ ఎంపీఓ ప్రసాద్, డీడీఎం నితిన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు తరలిరావాలి

కాశీబుగ్గ సెంటర్: జనవరి 13, 14తేదీల్లో రంగారెడ్డి జిల్లా మన్నెగూడ స్వార్థ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం సంఘం జిల్లా కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి బద్దం వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు మేకిరి దామోదర్, ప్రసాదరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు రద్దు చేయాలి

వరంగల్ రూరల్: మడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల క్యాటరింగ్ కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని ఏబీఎస్‌ఎఫ్ నాయకులు బొట్ల నరేష్, బీఎస్‌ఎఫ్ నాయకులు రాజేందర్‌లు కోరారు. ఈ మేరకు శనివారం ఆర్‌సీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం ఆర్‌సీఓ విద్యారాణికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాల, కళాశాల క్యాటరింగ్ కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా విద్యార్థులకు భోజనం పెడుతున్నారని ఆరోపించారు. తక్షణమే కాంట్రాక్ట్ రద్దు చేయాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సుమన్, శ్రీకాంత్, ప్రమోద్, ప్రశాంత్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత స్థాయికి..

- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నర్సంపేట రూరల్: క్రమశిక్షణతోనే ఉన్నతస్థాయిలో రాణించగలమని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరంలోని శ్రీగురుకుల పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలు (50 సంవత్సరాలు) శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసుకుని 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గర్వించదగిన విషయమన్నారు. పూర్వవిద్యార్థులందరూ ఒకే రకమైన దుస్తులు ధరించి రావడం అభినందనీయమన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగిన ఒదిగి ఉండటమనేది పాఠశాల స్థాయిలోనే సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే పెద్ది సదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతోనే యజమాని సమ్మిరెడ్డి ఈ ప్రాంత ప్రజలకోసం శ్రీగురుకులాన్ని ఏర్పాటు చేశారని కొనియాడారు. కరస్పాండెంట్ మోతె సమ్మిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో చదివిన విద్యార్థులు 33 దేశాల్లో సుమారు 550 మంది స్థిరపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి పనిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నర్సంపేట రూరల్: గ్రామాల్లో ప్రతి పని, ప్రణాళికాభివృద్ధిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. నర్సంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆరు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఆన్‌లైన్ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ జనన, మరణ, ఆస్తి మార్పిడి, ఇంటి అనుమతులు ఆన్‌లైన్‌లో మాత్రమే ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు జీపీ రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దివ్య, వరంగల్ డీఎల్‌పీఓ ప్రభాకర్, ఎంపీఓలు సునీల్‌కుమార్ రాజ్, కూచన ప్రకాశ్, శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్పంచ్‌పై ఉప సర్పంచ్ దాడి


గాయాన్ని చూపుతున్న సర్పంచ్ మల్లేశం

సంగెం: గ్రామ పంచాయతీ ప్రత్యేక సమావేశంలో సర్పంచ్‌పై ఉప సర్పంచ్ దాడి చేశాడు. వరంగల్ జిల్లా సంగెం మండలం గొల్లపల్లిలో శనివారం ఈ ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామ పంచాయతీ తాగునీటి మోటార్ కాలిపోగా రానున్న వేసవిలో నీటి ఎద్దడి నివారణ చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సర్పంచ్ మేరుగు మల్లేశం, ఉపసర్పంచ్ పేరబోయిన రాజు, వార్డు సభ్యులు కాసాని చేరాలు, నూనెల అనిల్, కోఆప్షన్ సభ్యుడు ఎల్లబోయిన స్వామి, పంచాయతీ కార్యదర్శి కవిత గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చేతిపంపు మరమ్మతు డబ్బు రూ.18 వేల బిల్లుకు సంబంధించిన విషయంలో సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో ఉప సర్పంచ్ పేరబోయిన రాజు, నూనెల అనిల్ చంపుతామని బెదిరిస్తూ కుర్చీలతో దాడి చేశారని సర్పంచ్ సంగెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ముగ్గురు యువకులపై కేసు నమోదు

ఖిలా వరంగల్: కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించి బెదిరింపులకు పాల్పడుతూ దాడికి యత్నించిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం రాత్రి మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి వరంగల్ ఫోర్ట్‌లోని ఏఎస్‌ఎం కళాశాల రహదారిపై కోల అరుణ్, కోల సాయి తరుణ్, సాయి మద్యం మత్తులో రహదారిపైకి వచ్చి వాహనదారులను బెదిరిస్తూ హల్‌చల్ సృష్టించారు. స్థానికుల సమాచారం మేరకు పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న వీ.అశోక్ అనే కానిస్టేబుల్ సంఘటన స్థలానికి చేరుకుని యువకులను ఇంటి వెళ్లాలని లేకుంటే స్టేషన్‌కు తీసుకెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. దీంతో ఆ యువకులు రెచ్చిపోయి కానిస్టేబుల్‌ను బెదరించడమే కాకుండా అతడిపై దాడికి యత్నించారు. ఈవిషయంపై కానిస్టేబుల్ అశోక్.. మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌ను శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

జాతీయ కళాఉత్సవ్‌లో లక్ష్మీప్రియ ప్రతిభ

కూచిపూడిలో ప్రథమ స్థానం
- ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో 5నుంచి 7 వరకు జరిగిన పోటీలు


కేంద్ర సహాయ మంత్రి అన్నపూర్ణ యాదవ్ చేతులమీదుగా బహుమతి అందుకుంటున్న లక్ష్మీప్రియ

విద్యారణ్యపురి: కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కళాఉత్సవ్ పోటీల్లో హనుమకొండ జిల్లాకు చెందిన పెండ్యాల లక్ష్మీప్రియ శాస్త్రీయ నృత్యం(కూచిపూడి)లో ప్రథమ స్థానం సాధించింది. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఈ నెల 5నుంచి 7వ తేదీ వరకు జాతీయ కళా ఉత్సవ్ జరిగింది. దేశంలోని 30 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొనగా శాస్త్రీయ నృత్యంతో లక్ష్మీప్రియ అద్భుత ప్రతిభ కనబరిచింది. ప్రథమ స్థానంలో నిలిచి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి అన్నపూర్ణ యాదవ్ చేతుల మీదుగా బహుమతి అందుకుంది.

ప్రతిభను వెలికితీసేందుకు..

కళా ఉత్సవ్ నేషనల్ కరిక్యులం ఫ్రేమ్ వర్క్ – 2005 ఉద్దేశాలకు అనుగుణంగా దేశంలోని విద్యార్థులను కళారంగం వైపు ఆకర్షించి వారిలోని ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో 2015లో భారత ప్రభుత్వం కళా ఉత్సవ్‌ను ప్రారంభించింది. సంగీతం, నృత్యం, నటన, చిత్రకళలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథములుగా నిలిచిన వారిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు.

ఐదేళ్లుగా సాధన..

పెండ్యాల లక్ష్మీప్రియ ప్రస్తుతం హనుమకొండ జిల్లా కాజీపేటలోని మౌంట్‌ఫోర్ట్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు పెండ్యాల రాకేష్‌కుమార్, సాయిలత. బి.శ్రీధర్ రావు శిక్షణలో సద్గురు శివానంద నృత్యమాల సంస్థలో ఐదేళ్లుగా కూచిపూడి నేర్చుకుంటోంది. నృత్యకారిణి పద్మశ్రీ, శోభానాయుడు తన రోల్‌మోడల్ అని.. ఏ రోజైనా తన సత్తా జాతీయస్థాయిలో నిరూపించుకోవాలనుకున్నానని.. అది ఈ రోజు సాధ్యమైందని లక్ష్మీప్రియ తెలిపింది. కాగా, లక్ష్మీప్రియ కూచిపూడి నృత్యంలో బాలికల విభాగంలో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ప్రాతినిధ్యం వహించింది. కళా ఉత్సవ్‌లో సత్యభామాకలాపమును కూచిపూడి నృత్యం ద్వారా ప్రదర్శించి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. రెండు, మూడు స్థానాల్లో బీహార్ ఒరిషా రాష్ట్రాల విద్యార్థులు నిలిచారు. ఈ మేరకు శనివారం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణ యాదవ్ చేతుల మీదుగా బహుమతి అందుకుంది. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన లక్ష్మీప్రియను జిల్లా నోడల్ అధికారి, క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, డీఈఓ డాక్టర్ మహ్మద్ అబ్దుల్‌హై ఫోన్‌లో అభినందించారు.

లైంగికదాడులకు వ్యతిరేకంగా పోరాడాలి

- పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య


మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య

కేసముద్రం: సమాజంలో మహిళలపై జరుగుతున్న లైంగికదాడులకు వ్యతిరేకంగా మహిళలంతా కలిసి పోరాడాలని పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం నిర్వహించిన ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) 3వ జిల్లా మహాసభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా పీఓడబ్ల్యూ స్త్రీల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతూ వస్తుందన్నారు. అదే విధంగా కుల, వర్గ, మత, జాతి వివక్షకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశామన్నారు. తెలంగాణ ఉద్యమంలో మహిళల పాత్ర కీలకమని, అందులో పీఓడబ్ల్యూ క్రియాశీలకమన్నారు. కేంద్రంలో బీజేపీ నిరంకుశ, నియంతృత్వ పాలన సాగిస్తుందని, దానికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని పేర్కొన్నారు. పీఓడబ్ల్యూ నాయకురాలు శివారపు శారద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, మురళీకృష్ణ, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గుజ్జు కృష్ణవేణి, కార్యదర్శి పద్మక్క, నర్సక్క, బట్టు బిన్నమ్మ, అనురాధ, రమ, కొమురక్క, స్వరూప, రామడుగు శ్యామల, అరుణోదయ కళాకారులు ఎండపాక శ్రీశైలం, హరీష్, బట్టు నాగేశ్వర్‌రావు, కొట్టం అంజన్న, దేవేందర్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వ కట్టకు మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్..

హసన్‌పర్తి: ఎస్సారెస్పీ వరంగల్ ప్రధాన కాల్వ పరిధిలోని డీబీఎం–22 వద్ద కట్టకు ఇటీవల బుంగ పడింది. ఈ మేరకు డిసెంబర్ 27న ఎస్సారెస్పీ కాల్వ కట్టకు బుంగ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన నీటిపారుల శాఖ సర్కిల్ సీఈ సుధాకర్‌రెడ్డి బుంగ పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. బుంగ పూడ్చినా ప్రయోజనం ఉండదని, కట్టను కొంతభాగం తొలగించి మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్కడే పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌ను పిలిచి పనులు చేపట్టాలని హుకూం జారీ చేశారు. వారం రోజుల పాటు డీఈఈ రాజు, ఏఈ భాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన పనులు శనివారం ముగిశాయి.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ‘కీ’ విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాలకు ఇటీవల ప్రవేశ పరీక్షలు నిర్వహించిన విషయం విదితమే. ఈ మేరకు 27 విభాగాలకు సంబంధించిన పరీక్షల ‘కీ’ని శనివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి విడుదల చేశారు. కేయూ వెబ్‌సైట్‌లో కీ అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. ‘కీ’లో ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 12వ తేదీలోపు పరీక్షల నియంత్రణాధికారి మెయిల్‌కు పంపించాలని సూచించారు.

బాలలతో మిర్చి తొడిమెలు తీసే పని

- వరంగల్ ఏనుమాముల మార్కెట్ సమీపంలో మిల్లులే అడ్డా
- తొమ్మిది మంది బాలురను సంరక్షించిన ఆపరేషన్ స్మైల్
- ఏడు రోజుల్లో 12 మంది బాల కార్మికులకు విముక్తి

సాక్షి, వరంగల్ : వరంగల్ ఏనుమాముల మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని మిల్లులు బాల కార్మికులకు అడ్డాగా మారాయి. మిర్చి తొడిమెలు పెద్దవారితో తీయిస్తే ఎక్కువ ఖర్చు అవుతుందనే ఉద్దేశంతో వ్యాపారులు పిల్లలను పనిలో పెట్టుకుంటున్నారు. కిలోకు రూ.20 చొప్పున ఇస్తూ అధిక పని చేయించుకుంటూ లబ్ధి పొందుతున్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దంటూ ప్రభుత్వ అధికారులు ప్రచారం చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం సీన్ రివర్స్ అవుతోంది. ముఖ్యంగా బీహార్‌కు చెందిన పిల్లలను పనిలోకి తీసుకుంటున్నారు. వరంగల్ ఏనుమాముల మార్కెట్ సమీపంలోని ఓ మిల్లులో శనివారం తొమ్మిది మంది బాలురకు అధికారులు విముక్తి కల్పించారు. 14 ఏళ్ల పైబడినవారు కావడంతో ఆపరేషన్ స్మైల్ విభాగం వారు కౌన్సెలింగ్ చేసి తల్లిదండ్రులకు అప్పగించారు.

రోజుకు రూ.60 నుంచి రూ.80 మాత్రమే..

ఇటీవల మార్కెట్‌కు మిర్చి రాక మొదలైంది. దీనికి తోడు గతంలో నిల్వ చేసిన మిర్చి తొడిమెలను తీసే పనులను బీహార్ పిల్లలకు అప్పగించారు. వీరు రోజుకు మూడు నుంచి నాలుగు కిలోల మిర్చి తొడిమెలు మాత్రమే తీస్తుంటారు. అంటే దాదాపు రూ.60 నుంచి రూ.80 మాత్రమే వస్తాయన్న మాట. ఈ లెక్కన నెలలో రూ.1,800 నుంచి రూ.2,400 మాత్రమే డబ్బు వస్తుంది. పేదరికంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పనులకు పంపిస్తుండగా, క్యాష్ చేసుకుంటున్న వ్యాపారులు తక్కువకే చెల్లిస్తూ ఎక్కువ పని చేయించుకుంటున్నారు.

ఏడు రోజుల్లో 12 మంది..

వరంగల్ నగరంతో పాటు నర్సంపేట, వర్ధన్నపేటలో హోటల్స్, పరిశ్రమలు, మిల్లులు, ఇటుక బట్టీలు తదితర చోట్ల పనిచేస్తున్న బాల కార్మికులను సంరక్షించడంపై ఆపరేషన్ స్మైల్ విభాగం దృష్టి సారించింది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతూ బాలలను సంరక్షిస్తోంది. జనవరి ఒకటి నుంచి 31 వరకు జరిగే ఈ ఆపరేషన్ స్మైల్‌లో ఇప్పటివరకు 12 మంది బాలకార్మికులను సంరక్షించారు. జార్ఖండ్‌కు చెందిన మిస్సింగ్ చైల్డ్‌ను పట్టుకొని సీడబ్ల్యూసీకి అప్పగించారు. వారి ఆదేశాల మేరకు దేశాయిపేటలో ఓ ప్రైవేట్ హోమ్‌లో పెట్టారు. జార్ఖండ్‌కు సీడబ్ల్యూసీ కమిటీకి బాబు వివరాలను మెయిల్ చేశారు. వరంగల్‌లో తొమ్మిది, నర్సంపేటలో ఒక్కరు, వర్ధన్నపేటలో ఇద్దరు బాల కార్మికులను సంరక్షించారు. ఎవరైనా బాలకార్మికులు కనబడితే చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100కి సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు

కాగా, ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా పోలీసులు, బాలల సంరక్షణ విభాగాధికారులు, చైల్డ్‌లైన్ టీమ్ మెంబర్లు, చైల్డ్ లేబర్ ఆఫీసర్లు సంయుక్తంగా కలిసి చేసిన దాడిలో 9 మంది బాలురను పట్టుకున్నారు. వీరి వయస్సు 14 నుంచి 16 ఏళ్ల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. వీరితో పని చేయించుకుంటున్న యజమానిపై బాల కార్మికుల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బాలలను పనిలో పెట్టుకోవద్దని, ఒకవేళ అలా చేస్తే రెండేళ్ల జైలు శిక్ష పడుతుందని హెచ్చరిస్తున్నారు. అదే సమయంలో రూ.20 వేల నుంచి రూ.50వేలు జరిమానా కట్టాల్సి ఉంటుందన్నారు.

కనిపిస్తే సమాచారం ఇవ్వండి..

ఈ ఫొటోల్లోని వారు చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడే ముఠాగా కమిషనరేట్ పోలీసులు శనివారం గుర్తించారు. ఈ మేరకు వీరి ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. ఈ వ్యక్తులు ఎక్కడైనా తారసపడినా.. గుర్తించినా తక్షణమే డయల్ 100 కాని, స్థానిక పోలీసులకు గాని సమాచారం ఇవ్వాలని కోరారు.
– వరంగల్‌క్రైం


పోలీసులు విడుదల చేసిన ఫొటోలు

మంచానికి నిప్పు పెట్టి హత్యాయత్నం

- జనగామ జిల్లా ఛాగల్లులో ఘటన


సంఘటనా స్థలంలో బాధితుడి నుంచి వివరాలను సేకరిస్తున్న సీఐ రాఘవేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: ఇంటి వద్ద మంచంలో పడుకున్న వ్యక్తి తలకు టవల్ చుట్టి మంచానికి కట్టి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టి హత్యాయత్నం చేశారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్లులో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. సీఐ రాఘవేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సంకెళ్ల వెంకన్న– ఉపేంద్ర దంపతులు గ్రామంలోని పరపతి సంఘంలో చిటీలు వేసి ఎత్తుకున్నారు. ఎత్తుకున్న చిటీలకు డబ్బు కట్టలేక గ్రామస్తుల వద్ద ఇంటి కాగితాలు పెట్టి అప్పు తెచ్చి, వ్యవసాయ భూమి అమ్మి చిటీల డబ్బు కట్టారు. మరిన్ని అప్పులు ఉండగా ఇల్లు అమ్మి తీర్చుదామని భార్య చెప్పగా వెంకన్న నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. 15 రోజులుగా వెంకన్న ఒంటరిగా ఉంటున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం రాత్రి ఇంటి ఎదుట మంచంలో పడుకున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు అతడి తలకు టవల్ చుట్టి మంచానికి కట్టివేశారు. ఇంట్లో ఉన్న వస్తువులను చిందరవందరగా చేశారు. వెంకన్నను హత్య చేయాలనే ఉద్దేశంతో మంచానికి నిప్పు పెట్టారు. వెంటనే తలకు ఉన్న టవల్‌ను విప్పేసుకుని వెంకన్న పెద్దగా కేకలు వేస్తూ చుట్టుపక్కల వారిని పిలిచాడు. దీంతో దుండగులు పరారయ్యారు. చుట్టుపక్కల వారు మంటలు అదుపు చేశారు. అప్పటికే మంచంతో పాటు ఇంట్లో ఉన్న వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన ముగ్గురికి జైలు


నిందితులతో ఎక్సైజ్ అధికారులు

గూడూరు: బైండోవర్ ఉల్లంఘన కేసులో తహసీల్దార్ అశోక్‌కుమార్ ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.భిక్షపతి శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, మూడు గుడిసెలలైన్ తండాకు చెందిన బోడ రజిత, తప్పట్ల కట్టమ్మ, భూక్య హనుమ గతంలో గుడుంబా విక్రయిస్తూ, నల్లబెల్లం అమ్ముతూ పట్టుపడ్డారు. దీంతో వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయినా బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి గుడుంబా, బెల్లం విక్రయిస్తూ పట్టుబడ్డారు. దీంతో తిరిగి తహసీల్దార్ అశోక్‌కుమార్ ఎదుట హాజరుపర్చగా బైండోవర్ ఉల్లంఘన కింద జైలు శిక్ష విధించారు. ముగ్గురిని ఖమ్మం జిల్లా జైలుకు తరలించారు. కార్యక్రమంలో ఎస్సై జయశ్రీగౌడ్, హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య, కానిస్టేబుల్ సుధాకర్, నరేష్, వెంకన్న, యుగంధర్ పాల్గొన్నారు.

నిడిగొండ పవర్‌ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం

- కిలోమీటర్ల మేర వ్యాపించిన పొగ


పవర్‌ప్లాంట్‌లో చెలరేగుతున్న మంటలు

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ శివారు ఎమ్మెస్సార్ మెగా బయో పవర్‌ప్లాంట్‌లో శనివారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష విలువ చేసే ప్లాస్టిక్ బెల్టు కాలిపోగా, యంత్ర సామగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లలేదు. జనగామ నుంచి అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకొని మంటలు అదుపు చేయడంతో భారీ నష్టం తప్పింది. కాగా, ఉనుక, కొబ్బరి బొండాలు, చెత్త చెదారంతో రోజుకు 7.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యం గల ఈ బయో పవర్‌ప్లాంట్ ఏడాది కాలంగా మూతపడి ఉంది. శనివారం ప్లాంట్ నుంచి ఒక్కసారిగా మంటలు, పొగలు వచ్చాయి. ప్లాంట్‌లో ఉన్న ఉనుకతో అగ్ని ప్రమాదం జరిగిందా..? షార్ట్‌సర్క్యూట్ కారణమా అని తేలాల్సి ఉంది. అగ్ని ప్రమాదంలో దట్టమైన పొగ కిలోమీటర్ల మేర వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

రెండో వివాహం చేసుకొని..

- మొదటి భార్యపై దాడి..
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

పరకాల: రెండో వివాహం చేసుకున్న ఓ భర్త మొదటి భార్యను తీవ్రంగా చితకబాది అంతమొందించాడు. హనుమకొండ జిల్లా పరకాల మండలం వెంకటాపూర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తురాయి శంకర్ రెండో వివాహం చేసుకుని మొదటి భార్య తురాయి సక్కుబాయి(34)ని వేధిస్తూ తీవ్రంగా కొట్టేవాడు. ఈ నెల 5న సక్కుబాయిని తీవ్రంగా కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకుని పడిపోయింది. చిరంజీవి అనే ఓ యువకుడు గమనించి ఆమె సోదరుడికి సమాచారం అందించాడు. దీంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి సక్కుబాయి మృతిచెందింది. మృతురాలి సోదరుడు మోరె రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, ఈ ఘటనపై ఏసీపీ శివరామయ్య, సీఐ కిషన్ శనివారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ద్విచక్రవాహనం పైనుంచి పడి మహిళ మృతి


సంఘటనా స్థలంలో సీత

వెంకటాపురం(కె): ద్విచక్రవాహనం పైనుంచి పడి మహిళ మృతి చెందింది. ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల కేంద్రంలోని కంకల వాగు సమీపంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండపాక గ్రామానికి చెందిన కురసం సీత (60) తన మనవడు రాజుతో కలిసి వ్యక్తిగత పని మీద బైక్‌పై వెంకటాపురం మండల కేంద్రానికి వచ్చింది. పని ముగిశాక తిరిగి స్వగ్రామమైన మండపాకకు బయలుదేరారు. కంకల వాగు వద్దకు చేరుకోగానే బైక్‌పై నుంచి సీత కిందపడిపోయింది. అపస్మారక స్థితికి చేరుకోవడంతో గ్రామస్తులు 108 వాహనానికి సమాచారం అందించారు. వెంకటాపురం వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

అత్యాచారం కేసులో యువకుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఇన్‌స్పెక్టర్

కాజీపేట: బాలికను బెదిరింపులకు గురిచేస్తూ అత్యాచారం చేసిన నిందితుడిని డీజిల్ కాలనీలో శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. డీజిల్ కాలనీకి చెందిన అమ్మాయితో పరిచయం పెంచుకుని శారీరకంగా వాడుకున్న వాంకుడోత్ చంద్ర అలియాస్ చంద్రశేఖర్(21)ను బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితుడు డీజిల్ కాలనీ ప్రాంతంలో ఉన్నట్లుగా సమాచారం రావడంతో అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్‌నని చెప్పి..

- చైన్ స్నాచింగ్


నర్సమ్మను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గీసుకొండ: పోలీస్ కానిస్టేబుల్‌నని నమ్మించి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరించిన ఘటన వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగదేవిపల్లి శివారు వరంగల్ – నర్సంపేట రహదారిపై శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గంగదేవిపల్లి శివారులో మేడిద నర్సమ్మ – మల్లయ్య దంపతులు కుటుంబంతో నివాసం ఉంటున్నారు. నర్సమ్మ శనివారం మధ్యాహ్నం సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి నడుచుకుంటూ ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో వెనకవైపు నుంచి బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి ఆమెతోపాటు ఇంటి వద్దకు వెళ్లి తాగడానికి నీరు అడిగాడు. తాను కానిస్టేబుల్‌ను అని, కేసు విచారణపై వచ్చానని నమ్మించి మాటల్లోకి దింపాడు. తర్వాత నర్సమ్మ తలపై ఆయుధంతో బలంగా మోదడంతో అక్కడికక్కడే కూలిపోయింది. దీంతో ఆమె మెడలోని 4 తులాల బంగారు పుస్తెలతాడు, నల్లపూసల గొలుసు లాక్కుని వెళ్లాడు. అపస్మారక స్థితిలో ఉన్న నర్సమ్మను బంధువులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ వెంకటలక్ష్మి, మామునూరు ఏసీపీ నరేశ్‌కుమార్, ఎస్‌ఐ శ్వేత ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఫ్యాక్టరీలపై విద్యుత్ అధికారుల దాడులు

కాజీపేట అర్బన్: మొండి బకాయిలు పడిన ఫ్యాక్టరీలపై విద్యుత్ అధికారులు శనివారం మెరుపు దాడులు నిర్వహించారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి కథనం ప్రకారం.. మడికొండ రాంపూర్‌లోని వీర వైష్ణవి గ్రానైట్స్ రూ.13,54,439, రాంపూర్‌కు చెందిన శ్రీ దుర్గా భవానీ పాలిమర్స్ ఫ్యాక్టరీకి సంబంధించిన రూ.11,97,595 విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. శనివారం రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం దాడులు నిర్వహించి ఫ్యాక్టరీలను సీజ్ చేశారు. తహసీల్దార్, పోలీస్, వీఆర్‌ఏల సమక్షంలో వస్తువులను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు.